ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY
5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 9 మే 2025

పంట పండిన చెనిక్కాయ


విరగ్గాసిన చెనిక్కాయలను చూపుతున్న రైతు నాగన్న

పెనుకొండ మండలం చిన్నప్పరెడ్డిపల్లి రైతు కురుబ నాగన్న వేరుశనగ 'పంట' పండించాడు. కె-7 గోల్డ్ రకం సాగు చేసి కేవలం 80 సెంట్లలో 80 బస్తాల దిగుబడి సాధించాడు. ఇదే గ్రామంలోని ఓ రైతు నుంచి క్వింటం విత్తనాన్ని రూ.12 వేలకు కొనుగోలు చేసిన నాగన్న.. రబీ పంటగా సాగు చేశాడు. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. విత్తనం, కూలీలు, ఎరువులు, పురుగు మందుల కోసం రూ.50 వేలు ఖర్చుచేశాడు. చెట్టుకు 60 కాయలు చొప్పున మంచి దిగుబడి వచ్చింది. వీటిని కొనేందుకు బెంగళూరు నుంచి కొందరు పొలం వద్దకే వచ్చారు. 40 కేజీల బస్తా రూ.2,200 ప్రకారం 80 బస్తాలను విక్రయించాడు. కాయలద్వారా రూ.1.76 లక్షలు, వేరుశనగ కట్టె ద్వారా మరో రూ.25 వేలు ఆదాయం వచ్చిందని, పెట్టుబడి పోనూ రూ.1.60 లక్షలు మిగిలిందని రైతు తెలిపాడు. గతంలో వివిధ రకాల పంటలు పెట్టినష్టపోయానని, ఈసారి కాలం కలిసొచ్చిందని హర్షం వ్యక్తం చేశాడు.

-ఆంధ్రజ్యోతి, పెనుకొండ రూరల్


పొలంలో పచ్చికాయలను తొలగిస్తున్న కూలీలు

మళ్లీ.. మీతోనే మహర్దశ..


హంద్రీనీవా లైనింగ్ పనులు

పారిశ్రామికాన్ని పరుగులు పెట్టించాలి..

ఉపాధి కోసం యువత ఎదురుచూపు


సేద్యానికి చేయూత కావాలి..

నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

వజ్రకరూరు మండలంలో పర్యటన



కియ కార్ల పరిశ్రమ



పుట్టపర్తి, మే 8(ఆంధ్రజ్యోతి): కియ.. కోసం దేశంలోని ఎన్నో రాష్ట్రాలతో పోటీపడ్డారు. అంత ర్జాతీయ దిగ్గజాన్ని ఒప్పించి, అనంతకు తెచ్చారు. రాళ్ల గుట్టల్లో కార్లు మొలిపించారు. పెద్దపెద్ద పరిశ్రమలను పట్టుకొచ్చి హబ్‌లా మార్చేశారు. వేలమంది కరువు జిల్లా యువతకు ఉపాధి కల్పించారు. అనంత ముఖచిత్రాన్ని మార్చేశారు. ఆగమేఘాలపై రిజర్వాయర్ కట్టారు. హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణమ్మను తీసుకొచ్చారు. అన్నదాతకు అండగా నిలిచారు. బీళ్లను పచ్చిక బయళ్లుగా మార్చేశారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం కొలువుదీరడంతో అన్నీ ఆగిపోయాయి. పరిశ్రమలు పారిపో యాయి. హంద్రీనీవా పనులు అటకెక్కాయి. కాలువ నీటితో జిల్లాలో చెరువులను కూడా నింపలేకపోయారు. ఉపాధి లేక యువత వలస బాట పట్టారు. అభివృద్ధి ఊసేలేక చీకట్లు అలు ముకున్నాయి. మళ్లీ మీరొచ్చారు. సగటు జిల్లా వాసిలో ఆశలు రేగాయి. ఆకాంక్షలు రేకెత్తాయి. అందుకు తగ్గట్టే హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. కరువు జిల్లాకు మరిన్ని కృష్ణాజలాలు తీసుకొచ్చేందుకు కంకణం కట్టుకున్నారు. ఇక, పారిశ్రామికం మళ్లీ ప్రగతిబాట పడుతుందని అనంత జనం సంబర పడుతున్నారు. ఉద్యోగాలు వస్తాయని యువత ఆశలు పెంచుకుంటున్నారు. అన్నీ.. మీరే నెరవే ర్చాలి.. మళ్లీ మహర్దశ పట్టించాలి..

రైతన్నకు చేయూతనిస్తేనే..

అతివృష్టి, అనావృష్టితో పంటలు చేతికందక రైతన్నలకు అప్పులే మిగిలాయి. గత ఖరీఫ్, రబీ సీజన్‌లో కనీసం సేద్యం ఖర్చులు దక్కలేదు. 2024-25 రబీ సీజన్‌లో ఈశాన్య రుతుపవనాల కరువు ప్రభావిత మండలాల్లో జిల్లాలో కేవలం రెండు మండలాలకే స్థానం లభించింది. గత ఖరీఫ్‌లో కరువు మండలాల జాబితాలో 22 మండలాలకు చోటు దక్కలేదు. ఏటా రుణభారం కూడ గట్టుకుంటున్న రైతుకు చేయూతనిచ్చి ప్రతి చెరువు


పుట్టపర్తిలోని పారిశ్రామిక వాడ

నింపి వ్యవసాయాన్ని పండుగలా చేయాలి. జిల్లాలో ఇప్పటికే హంద్రీనీవా రెండోదశ ప్రధాన కాలువ, పుంగనూరు ఉపకాలువ లైనింగ్ పనులు జరుగుతున్నా.. చాలా సాగునీటి ప్రాజెక్టులను మరింత పరుగులు పెట్టించి చివరి ఆయకట్టుకు నీరివ్వాలి.

చేనేత మెగా క్లస్టర్ ఏర్పాటు ఎప్పుడో..?

జిల్లాలో వ్యవసాయం తరువాత లక్షలాది కుటుంబాలు చేనేతపై ఆధారపడి జీవిస్తున్నాయి. ధర్మవరం, హిందూపురం, సోమందేపల్లి, గోరంట్ల, ముద్దిరెడ్డిపల్లి ఇలా జిల్లా వ్యాప్తంగా లక్షల మంది చేనేత పరిశ్రమపై జీవిస్తున్నారు. గత బడ్జెట్‌లో చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేదిశగా ధర్మవరంలో రూ.35 కోట్లతో మెగా చేనేత క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఆ దిశగా అడుగులు పడలేదు. ఈనేపథ్యంలో చేనేత క్లస్టర్ ఏర్పాటు ఎప్పుడన్న చర్చలు వినిపిస్తున్నాయి.

పరాయి పంచనే ఇంకెన్నాళ్లు?

గత ప్రభుత్వం 2022 ఏప్రిల్ 4న పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటుతో అట్టహాసంగా కొత్త జిల్లాలో పరిపాలన ప్రారంభించి, వదిలేసింది. జిల్లా ఏర్పాటు చేసి మూడేళ్లు దాటినా పక్కాభవనాలు లేక పరాయి పంచనే పాలన సాగిస్తోంది. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు మినహా ప్రభుత్వ కార్యాలయాల్లో కనీస వసతుల్లేవు. ఇరుకు గదుల్లో, అరకొర వసతులతో జిల్లా కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది పనిచేయాల్సివస్తోంది. ఇంకెన్నాళ్లు ఈ తిప్పలు అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పారిశ్రామిక రంగానికి ఊపునివ్వాలి

కియతోపాటు అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో జిల్లా ఆటోమొబైల్ హబ్‌గా మారింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన బెల్, నాసెన్ స్థాపనతో జిల్లాకు జాతీయ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. వేలాది మందికి ఉద్యోగావకాశాలు దక్కాయి. వైసీపీ పాలనలో ఐదేళ్లు అభివృద్ధి ఊసేలేకుండా పోయింది. గతేడాది కొత్త ప్రభుత్వం కొలువుదీరాక అభివృద్ధి పట్టాలెక్కింది. వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు ముందుకు వస్తున్నారు. తాజాగా మడకశిర నియోజక వర్గంలో మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమ భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ కల్యాణి స్ట్రాటిజిక్ సిస్టం లిమిటెడ్ (కేఎస్ఎస్ఎల్) రక్షణ రంగానికి అవసరమైన ఫిరంగుల మందుగుండు తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తోంది. కల్లుమర్రి గ్రామాల పరిధిలో 15 వేల ఎకరాల్లో రూ.7500 కోట్లతో సోలార్ పార్క్ ఏర్పాటుకు పరిశ్రమలు ముందుకొచ్చాయి. చిలమత్తూరు మండలం టేకులోడులో 1,105 ఎకరాల్లో భారీ ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో రూ.1,239 కోట్ల పెట్టుబడులతో 4,049 మందికి ఉపాధి కల్పన దిశగా 40 పరిశ్రమలకు 1,056 ఎకరాల భూములు కేటాయించారు. ఈ నేపథ్యంలో మరింత ఊతమిస్తే పారిశ్రామికంగా దూసుకెళ్తుంది.


తాడిమర్రి మండలం మద్దలచెరువు వద్ద ఎండిన వేరుశనగ పంటను ట్రాక్టర్‌తో తొలగిస్తున్న రైతులు(ఫైల్)

దోస రైతు ఘోష

అమాంతం పడిపోయిన ధరలు

రైతులే సంతల్లో అమ్ముకుంటున్న దైన్యం

పెట్టుబడులు కూడా రాలేదని ఆవేదన

కొంపముంచిన కుందన్ రకం


ఒక వైపు ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు చీడపీడలను తట్టుకుని ఎలాగో పంటను గట్టెక్కించినా చివరికి దళారి చేతిలో రైతు చిక్కి శల్యమైపోతున్నాడు. ఎండాకాలంలో దోస పంటకు బాగా గిరాకీ ఉంటుందనే ఆశతో పెట్టుబడులకు వెరవక భారీగా ఖర్చు చేసి పంటనైతే తీసుకురాగలిగాడు కానీ.. వ్యాపారుల, దళారుల సిండికేట్‌తో తక్కువ ధరకు అమ్ముకోలేక పొలంలోనే వదిలేసిన రైతులు కొందరైతే.. స్వయంగా సంతలకు తీసుకెళ్లి విక్రయిస్తున్న వారు మరికొందరు. ప్రత్యేకించి భారీగా పెట్టుబడులు పెట్టిన కుందన్ రకం దోస రైతును నిండా ముంచింది.


వెంకటాంపల్లి వద్ద కోసిన ఢిల్లీ దోస రకం

కొత్తచెరువు, మే 8(ఆంధ్రజ్యోతి): రైతు కష్టపడి ఏ పంట సాగుచేసినా గిట్టుబాటు ధర లేక చివరికి కన్నీరే మిగులుతోంది. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వందలాది హెక్టార్లలో కుందన్ దోస, ఢిల్లీ దోస, సాంబార్ దోస, కర్బుజా తదితర దోస పంటలను సాగుచేశారు. ధరలు లేక పోవడంతో రైతులు నిండా మునిగారు. సంప్రదాయ పంటలతో నష్టాలు వస్తుండడంతో స్వల్పకాలిక పంటలైన దోస సాగు వైపు రైతులు మొగ్గు చూపారు. అందులోనూ కుందన్ రకం దోసను జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో సాగు చేశారు. ఖర్చుతో కూడుకున్నదయినా లాభాలు వస్తాయన్న ఆశతో పెట్టుబడులు పెట్టారు. ఆశించిన మేరకు దిగుబడి కూడా వచ్చింది. తీరా పంట కోతకు వచ్చేసరికి ధరలు కుప్పకూలడంతో కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. చేసేది లేక దోస కాయలను ట్రాక్టర్లలో వేసుకొని సంతల్లో అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

800 హెక్టార్లలో సాగు

కుందన్ రకం దోస సాగుకు పెట్టుబడి ఎక్కువయినా రైతులు వెనుకంజ వేయలేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 800 హెక్టార్లకు పైగా ఈ దోస పంటను సాగుచేసినట్లు ఉద్యానశాఖ అధికారుల గణాంకాల ద్వారా తెలుస్తోంది. సేద్యం మొదలుకుని మల్చింగ్, విత్తనం, క్రిమి సంహారక మందులు, ఎరువులు, డ్రిప్, కూలీలకు ఇలా ఎకరా పంటసాగుకు రూ.లక్ష వరకూ ఖర్చు వస్తోంది. ఎకరాకు 10 టన్నులు దిగుబడి వస్తోందని, మంచి ధరలు ఉంటే ఖర్చులు పోను ఒకటిన్నర లక్ష నుంచి రెండు లక్షల వరకు ఆదాయం వచ్చేదని రైతులు చెబుతున్నారు. కుందన్ రకం దోస బెంగళూరులో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెల వరకూ టన్ను రూ.20వేల నుంచి రూ. 30 వేల వరకూ ధర పలికింది. తర్వాత ఒక్కసారిగా టన్ను రూ.6 వేల నుంచి రూ.8 వేలకు పడిపోయింది.


వెంకటంపల్లి వద్ద పొలంలో రాశిగా పోసిన కుందన్ రకం దోస

మార్కెటింగ్ సౌకర్యంలేక ఇక్కట్లు

జిల్లాలో మార్కెటింగ్ సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా రు. కోత కొచ్చిన దోస పంటను మూడు రోజుల్లో విక్రయించుకోవాలి. లేదంటే కాయలు పగలడం, ఊజీ పడడం, ఎండకు నాణ్యత తగ్గడం తదితర వాటితో నష్టపోవాల్సి వస్తుంది. దీనిని ఆసరా చేసుకుని వ్యాపారులు తోటలను తక్కువ ధరకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. ఒకవేళ రైతులే బెంగళూరు మార్కెట్‌కు తీసుకెళ్లినా.. ఇక్కడి వ్యాపారులు అక్కడి మండీలకు ఫోన్‌చేసి సిండికేట్ అయి తక్కువ ధరకు కొనేలా చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.



కోలుకోలేని నష్టం



ఈ ఏడు మామిడి పంట లేక పోవడంతో దోసకాయకు మంచి ధర ఉంటుందని ఆరు ఎకరాల్లో కుందన్ రకం దోస పంటను సాగు చేశాను. ఇందుకోసం రూ. 6 లక్షలు పెట్టుబడులు పెట్టాను. దోసతోట కూడా బాగా పెరిగింది. దిగుబడికూడా బాగా వచ్చింది. ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రాలేదు. పంటను అలాగే పొలంలోనే వదిలేశా. దీంతో కోలుకోలేని నష్టం మిగిల్చింది.

-నారాయణరెడ్డి, మరకుంటపల్లి

సంతల్లో అమ్ముకుంటున్నా



ఐదు ఎకరాల్లో కర్బూజ పంటను సాగుచేశాను. తీగ బాగా సాగి కాయలు బాగా కాశాయి. మరో పదిరోజుల్లో కోతకు వస్తాయనుకుంటున్న సమయంలో మార్కెట్‌లో కర్బూజ టన్ను రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ ఉన్న ధర ఒక్కసారిగా రూ.6 వేలకు పడిపోయింది. ఆ ధరకైనా వ్యాపారులు తోట కొనేందుకు ముందుకు రాలేదు. చేసేది లేక కాయలను కోసి సంతల్లో అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. పెట్టుబడి కూడా రాలేదు. మాలాంటి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- గంగాద్రి, వంగంపల్లి

అధికంగా సాగు చేయడంతోనే..



గతంలో దోస పంటలను చాలా తక్కువ మంది రైతులు సాగుచేసేవారు. దీంతో ధర బాగా ఉండేది. ఈసారి వర్షాలు ఆలస్యంగా కురిశాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా ఎక్కువ మంది రైతులు అంతా ఒకే అదునులో దోస రకాల పంటలను సాగుచేశారు. అనుకున్న దానికంటే దిగుబడి బాగా రావడంతో మార్కెట్‌లో ధర తగ్గింది. జిల్లాలో మార్కెట్ అందుబాటులో లేక పోవడం.. వ్యాపారులనే నమ్ముకోవడం వంటి కారణాల వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు. రైతే స్వయంగా మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముకునే స్థాయికి ఎదగాలి. జ

- చంద్రశేఖర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

పుష్పమండపంపై ఊరేగిన చెన్నకేశవుడు

ధర్మవరం, మే 8(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం చెన్నకేశవ స్వామిస్వామిని పుష్పమండపంపై ఊరేగించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ ఊరేగింపులో భక్తులు పూజలు చేయించి తమ మొక్కులను తీర్చుకున్నారు. రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అన్నమయ్యసేవా మండలి అధ్యక్షుడు పొరాళ్లపుల్లయ్య శిష్యబృందం అన్నమయ్య నగర సంకీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ అడహక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్, ఈఓ వెంకటేశ్వర్లు, అర్చకులు కోనేరాచార్యులు, భానుప్రకాశ్, పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం శేషవాహనం, సాయంత్రం గజ వాహనాలపై చెన్నకేశవుడు ఊరేగనున్నట్టు ఆలయ ఈఓతెలిపారు.


పెళ్లి పీటలపై స్వామి, అమ్మవార్లు

మృతదేహంతో ముట్టడి

తహసీల్దారు కార్యాలయం వద్ద రైతు కుటుంబం ఆందోళన

భూ వివాదంతో ఆత్మహత్య చేసుకున్న రైతు శంకర్ నాయక్


తహసీల్దార్ కార్యాలయం వద్ద అంబులెన్స్‌లో శంకర్‌నాయక్ మృతదేహం

తనకల్లు, మే 8(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రామ్లానాయక్ తండాకు చెందిన శంకర్‌నాయక్(50) ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు తనకల్లు తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శంకర్ నాయక్ గురువారం మృతిచెందాడు. బాధితులు తెలిపిన మేరకు, భూమి విషయంతో న్యాయం జరగలేదన్న బాధతో ఈ నెల 2న శంకర్‌నాయక్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం అనంతపురం తరలించినా ప్రయోజనం లేకపోయింది. పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్న 5 ఎకరాల ప్రభుత్వ భూమి ని, రెవెన్యూ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇతరులకు పట్టాలు ఇచ్చారని, న్యాయం కోసం ఆరు నెలలపాటు శంకర్ నాయక్ అధికారుల చుట్టూ తిరిగారని వాపోయారు. ఆస్పత్రి నుంచి నేరుగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు మృతదేహాన్ని తీసుకువెళ్లి బైఠాయించడంతో తహసీల్దారు శోభాసువర్ణమ్మ వారితో మాట్లాడారు. విచారించి, ఉన్నతాధికారులకు నివేదికలు పంపి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

నీలకంఠాపురంలో శత్రునాశన హోమం

మడకశిర రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సేనలకు విజయం దక్కాలని ఆకాంక్షిస్తూ నీలకంఠాపురంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి గురువారం శత్రు నాశన హోమం నిర్వహించారు. 'జై భారత్, జైజై భారత్' అని నినాదాలు చేస్తూ పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, వేద పండితులు పాల్గొన్నారు.


శత్రు నాశన ప్రత్యేక హోమం చేస్తున్న రఘువీరారెడ్డి

రాయలసీమ ద్రోహి.. జగన్

ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి



మాట్లాడుతున్న కేశవరెడ్డి, ఆలం, రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం, మే 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ రైతులకు వైఎస్ జగన్ తీరని ద్రోహం చేశారని ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. హంద్రీనీవాపై వైసీపీ నేతల ఆరోపణలపై టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డితో కలిసి ఆయన గురువారం పార్టీ స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. కరువు సీమకు హంద్రీనీవా ఓ వరం అన్నారు. వైసీపీ హయాంలో గంపెడు మట్టి కూడా తీయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడగానే ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవా విస్తరణ, లైనింగ్ పనులు చేపట్టారన్నారు. హంద్రీనీవా పనులు పూర్తి చేసి, రికార్డు సృష్టిస్తామన్నారు. హంద్రీనీవా కాలువ పరిధిలోని అన్ని చెరువులు నింపి, రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే సీఎం చంద్రబాబు శుక్రవారం జిల్లాకు రానున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ అశోక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

ఉరవకొండ, మే 8(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపి, ఆయకట్టుకు సాగునీరు అందించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని దేవాంగ కల్యాణమండపంలో గురువారం ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కాలువలో 10వేల క్యూసెక్కులు పారిస్తామన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేసి, నీరు ఇచ్చినపుడే రైతులకు మేలు చేకూరుతుందన్నారు. కాలువ లైనింగ్ పనులతో రైతులకు ఒరిగేదేమీ లేదన్నారు. రెండో దశలో లైనింగ్ పనులు ఆపాలని డిమాండ్ చేశారు. లేదంటే అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. మిర్చి పంట గిట్టుబాటు ధరలేక రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బ్యాళ్ల ప్రసాద్, శీనా, అబ్బాస్, రమేష్ పాల్గొన్నారు.

ఆ జీఓ రద్దు చేయాలి

హంద్రీనీవా ప్రాజెక్టు ప్రయోజనాలను కుదించే జీఓ 404, 405లను రద్దు చేయాలని రైతు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జీవో ప్రతులను చూపుతూ నిరసన తెలిపారు. హంద్రీనీవా ప్రాజెక్టు కాలువను మల్యాల నుంచి జీడిపల్లి వరకూ 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలన్నారు. ప్రధాన కాలువ లైనింగ్ పనులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు, ప్రజాసంఘాల నాయకులు మధుసూదన్, కృష్ణమూర్తి, బాలరంగయ్య, రంగారెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎఫ్‌పీఓలకు నాఫెడ్ పురస్కారాలు



నాఫెడ్ ఎండీ నుంచి అవార్డు అందుకుంటున్న బత్తలపల్లి రైతు, ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, సీఈఓ పవన్

అనంతపురం అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ, బత్తలపల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘాల డైరెక్టర్, సీఈఓలకు నాఫెడ్ ఎండీ దీపక్ అగర్వాల్ ఉత్తమ పురస్కారాలను గురువారం ప్రదానం చేశారు. ఢిల్లీలోని నాఫెడ్ ప్రధాన కార్యాలయంలో ముదిగుబ్బ రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ ఆవుల చంద్రమోహన్, సీఈఓ సతీష్, బత్తలపల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, సీఈఓ పవన్‌కు నాఫెడ్ ఎండీ దీపక్ అగర్వాల్ ప్రశంసా పత్రం, జ్ఞాపికలు అందజేశారు. ఎఫ్‌పీఓల నిర్వహణ, వ్యాపార లావాదేవీలు, ప్రభుత్వ, ఇతర సంస్థలతో అనుసంధానం తదితర అంశాల్లో ప్రగతి సాధించినందుకు ఈ పురస్కారాలను అందజేశారు. ఈ ఎఫ్‌పీఓలు ఎరువులు, పురుగు మందుల డీలర్‌షిప్ తీసుకుని, సరసమైన ధరలకు రైతులకు అందజేశాయి. గత ఏడాది ముదిగుబ్బ ఎఫ్‌పీఓ రూ.5 కోట్లు, బత్తలపల్లి ఎఫ్‌పీఓ రూ.8 కోట్లు వ్యాపార లావాదేవీలు జరిపాయి. నాఫెడ్ పరిధిలో దేశ వ్యాప్తంగా 1280 ఎఫ్‌పీఓలు ఉండగా.. పురస్కారాలను దక్కించుకున్న 12 సంఘాలలో శ్రీసత్యసాయి జిల్లా నుంచి రెండు ఉండటం విశేషం. డైరెక్టర్లు, సీఈఓలకు జీటీ భారత్ టీం లీడర్ రామాంజులు, అధికారులు, రైతులు శుభాకాంక్షలు తెలియజేశారు.



నాఫెడ్ ఎండీ నుంచి అవార్డు అందుకుంటున్న ముదిగుబ్బ రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ ఆవుల చంద్రమోహన్, సీఈఓ సతీష్



గాయపడిన వారిని స్ట్రెచర్‌పై ఇలా తరలిస్తామని..



బిల్డింగ్‌పై గాయపడి నడవలేని స్థితిలో ఉన్నవారిని తాడు సాయంతో కిందకు దించే ప్రక్రియ

యుద్ధం.. భద్రం..!

స్వీయరక్షణ, సహాయక చర్యలపై మాక్ డ్రిల్

ఆర్టీసీ బస్టాండులో నిర్వహించిన అధికారులు

అనంతపురం కల్చరల్, మే 8(ఆంధ్రజ్యోతి): యుద్ధవాతావరణం నేపథ్యంలో భద్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. అనంతపురం బస్టాండులో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. డీఆర్వో మలోల, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాస రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల జాబితాలో జిల్లా లేనప్పటికీ అంతర్గత భద్రత అవసరమని డీఆర్వో అన్నారు. యుద్ధ ప్రభావం ఈ ప్రాంతంపై పడితే ప్రభుత్వం ముందస్తుగా సైరన్ మోగిస్తుందని, ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శత్రుదేశాలవారు ప్రజల్లో కలిసిపోయి బాంబులు పెట్టే ప్రమాదం ఉందని, అనుమానాస్పదంగా ఏవైనా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రమాద సమయంలో స్వీయ భద్రతను పాటిస్తూనే తోటివారికి సాయపడాలని డీఎఫ్‌ఓ సూచించారు. పోలీసు, అగ్నిమాపక శాఖ, వైద్య శాఖ ఎమర్జెన్సీ టోల్ ఫ్రీ నంబర్లను ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో పోస్టులను వెంటనే నమ్మకుండా, వాస్తవాలను తెలుసుకుని స్పందించాలని అన్నారు. ఆలయాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ఏదైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం చేరవేయాలని సూచించారు. అనంతరం రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు, వైద్యశాఖ సిబ్బంది సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆపద సమయంలో ఎలా వ్యవహరించాలో చేసి చూపించారు. మాక్‌డ్రిల్‌ను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఏడీఎఫ్‌ఓ కేపీ లింగమయ్య, నాలుగో పట్టణ సీఐ సాయినాథ్, 108 జిల్లా మేనేజర్ తిరుపతి నాయుడు, ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం శ్రీలక్ష్మి, డీఎం నాగభూపాల్, బస్టాండు మేనేజర్ కేవీఎన్ మూర్తి, ఎస్‌టీఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

గుంతకల్లుకు సాగు నీరివ్వండి..!

సీఎం చంద్రబాబుకు రైతుల వినతి

గుంతకల్లు, మే 8(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కింద గుంతకల్లు నియోజకవర్గానికి అధికారికంగా ఆయకట్టును కేటాయించాలంటూ స్థానిక రైతులు కోరుతున్నారు. హంద్రీనీవా కాలువ జిల్లాలోకి ప్రవేశించేది గుంతకల్లు మండలంలోనే. అయినా, గుంతకల్లు నియోజకవర్గానికి ఆ ప్రాజెక్టు కింద ఆయకట్టే కేటాయించలేదని వారు వాపోతున్నారు. కళ్లెదుటే కాలువ నిండా నీరు వెళ్తున్నా, గుంతకల్లు నియోజకవర్గంలో ఒక ఎకరాకూ అధికారికంగా నీటిని వాడుకునే వీలు కల్పించలేదని స్థానిక రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఉరవకొండ నియోజకవర్గంలో ఛాయాపురం వద్ద హంద్రీనీవా సందర్శనకు వస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఇక్కడి రైతులు ఆయకట్టు విషయంగా వేడుకుంటున్నారు. గుంతకల్లు, గుత్తి మండలాలకు అధికారికంగా ఒక్క ఎకరాకూ ఏ ప్రాజెక్టు నుంచీ సాగునీరందడం లేదు. హంద్రీనీవా కాలువను ప్రారంభించేటపుడు 2013లో కాంగ్రెస్ హయాంలో నియోజకవర్గానికి ఆయకట్టు కేటాయించకపోవడంతో అన్యాయం జరిగిందనీ, కనీసం హంద్రీనీవాను వెడల్పు చేస్తున్న సందర్భంగానైనా అధికారికంగా నీటి కేటాయింపు జరగాలని రైతులు కోరుకుంటున్నారు.

రెండు ప్రాజెక్టులున్నా..

గుంతకల్లు నియోజకవర్గంలో రెండు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు హంద్రీనీవా, గుత్తి సబ్‌బ్రాంచ్ కెనాల్ (జీఎస్‌బీసీ) ఉన్నా రైతులకు ఒరిగింది శూన్యం. జీఎస్‌బీసీ కింద 16,271 ఎకరాల అధికారిక ఆయకట్టు ఉన్నా జీబీసీ నుంచి చుక్కనీరు ఈ ప్రాజెక్టులోకి రావడంలేదు. హెచ్చెల్సీ నుంచి జీబీసీకే తక్కువ నీటి కోటా వస్తుండటంతో 15 ఏళ్లుగా గుత్తి, ఆలూరు బ్రాంచ్ కాలువలకు సాగునీరు రాకుండా నిలిచిపోయింది. 2013లో హంద్రీనీవా ప్రారంభం అయ్యాక అనధికారికంగా ఈ బ్రాంచ్ కాలువలకు కొద్దిపాటి నీటిని విడుదల చేస్తున్నారు. హంద్రీనీవా నుంచి కూడా గుంతకల్లు నియోజకవర్గంలో ఎకరా ఆకయట్టు కూడా లభించకపోవడంతో రైతులు నిరాశకు లోనయ్యారు. కాలువ వెడల్పు, లైనింగ్ జరిగిందంటే టెయిల్ ఎండ్‌కు నీటిని తీసుకెళ్లడానికి అంటూ హంద్రీనీవా నీటిని జీఎస్‌బీసీకి వదలకుండా మొండిచేయి చూపుతారంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఆ రెండింటికీ గ్రీన్ సిగ్నల్ కావాలి

వజ్రకరూరు మండలం రాగులపాటు వద్ద నుంచి తూమును ఏర్పాటుచేసి గుంతకల్లు మండలంలోని 12 చెరువులకు నీరందించే ప్రాజెక్టును వెంటనే చేపట్టాలని రైతులు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే జయరాం కూడా ఆ ప్రాజెక్టు విషయంగా ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖామంత్రి వద్ద గట్టి ప్రయత్నం చేస్తున్నారు. 2017లో పామిడి సభలో చంద్రబాబు ఈ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. తప్పక సాకారం అవుతుందని భావిస్తున్నారు. కాగా జీఎస్‌బీసీకి హెచ్చెల్సీ నీరు లభించే అవకాశం అడుగంటినందున, హంద్రీనీవా నుంచి గ్రావిటీ కింద సాగునీరందించే అవకాశం ఉంది. ఈ విషయంగా కూడా ప్రతిపాదన ఉండగా, దానిని ఆమోదిస్తే నియోజకవర్గంలోని గుంతకల్లు, గుత్తి, పామిడి మండలల్లోని 16,271 ఎకరాలకు సాగునీరు లభిస్తుంది. ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలపాలని సీఎంకు రైతులు విన్నవించుకుంటున్నారు.

ఆయకట్టు కోసం ఎదురుచూపు

ఉరవకొండ: హంద్రీనీవా ఆయకట్టు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేస్తారని రైతులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రధాన కాలువపై మాత్రమే దృష్టి సారించారు. పిల్లకాలువలను పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రతిపక్ష హోదాలో జగన్మోహన్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీలు నీటి మీద రాతలుగా మారిపోయాయని రైతులు పేర్కొంటున్నారు. 2017 ఫిబ్రవరిలో ఉరవకొండలో జరిగిన మహాధర్నాలో జగన్ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో మిగిలిపోయిన డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తిచేసి, ఆయకట్టుకు నీరు అందిస్తామన్నారు. హంద్రీనీవా కాలువపై వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లూ నిర్లక్ష్యం ప్రదర్శించింది. కనీసం కాలువలో గంపెడు మట్టి కూడా తీయలేదు. సాగునీటి ప్రాజెక్టులను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. తవ్విన పిల్లకాలువలో కూడా పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో కాలువ రూపురేఖలే మారిపోయాయి. కృష్ణాజలాలతో రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు 1989లో హంద్రీనీవా పథకానికి అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, చిత్తూరు, జిల్లాలకు కృష్ణా జలాలు తరలించాలన్నదే ప్రధాన ఉద్దేశం. 2019 వరకూ పనిచేసిన ప్రభుత్వాలు పథకం పనలను ముందుకు తీసుకెళ్లాయి. హంద్రీనీవాకు సంబంధించిన పనులు 2012లోనే 95శాతం పనులు పూర్తయ్యాయి. అప్పటినుంచి ప్రధాన కాలువకు నీరు ప్రవహిస్తోంది. నీరు ప్రవహిస్తున్నా కాలువ నుంచి ఆయకట్టుకు ఉపయోగించుకోలేని పరిస్థితి. ప్రధాన కారణం హంద్రీనీవా కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీలు పూర్తికాకపోవడమే. 33, 34, 36 ప్యాకేజీల్లో డిస్ట్రిబ్యూటరీ పనులు కూడా చేపట్టారు. 33, 34 ప్యాకేజీల్లో 90 శాతం పనులు గతంలోనే పూర్తయ్యాయి. వంతెనలు, కల్వర్టులు, అక్విడెక్టల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. 2 నుంచి 3 శాతం పనులు పూర్తి కావాల్సి ఉన్నా.. ఐదేళ్లూ వైసీపీ ప్రభుత్వం ఆ దిశగా అడుగు కూడా వేయలేదు. 36వ ప్యాకేజీలో 18శాతం పనులు పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 25శాతం కంటే తక్కువ పూర్తయిన పనులను రద్దు చేశారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

కలెక్టర్ వినోద్‌కుమార్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ఉరవకొండ, మే 8(ఆంధ్రజ్యోతి): సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. వజ్రకరూరు మండలం ఛాయాపరం గ్రామంలో సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ గురువారం పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. లోటుపాట్లు లేకుండా పర్యటనను జయప్రదం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో కాన్వాయ్ రిహార్సల్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ జగదీష్, జేసీ శివనారాయణ శర్మ, ఏఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్ బాషా, డీఎస్పీలు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

ఎస్పీ రత్న



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో సత్యసాయి విమానాశ్రయంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని ఎస్పీ రత్న తెలిపారు. సీఎం భద్రత అధికారి చంద్రశేఖర్‌తో కలసి బందోబస్తుపై పోలీసు అధికారులకు ఆమె గురువారం దిశానిర్దేశం చేశారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. వై జంక్షన్ నుంచి ముఖ్య ప్రజాప్రతినిధుల వాహనాలను మాత్రమే ఎయిర్‌పోర్టు వరకు అనుమతించాలని సూచించారు. ప్రధాన ద్వారం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి, విమానాశ్రయంలోకి పంపాలని సూచించారు. కలెక్టర్ మంజూరు చేసిన జాబితాలో పేర్లు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలని సూచించారు. సమీక్షలో డీఎస్పీలు విజయ్ కుమార్, నరసింగప్ప, శివన్నారాయణస్వామి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్పీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఎస్పీ ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఆర్ఐలు వలి, మహేష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- ముఖ్యమంత్రి పర్యటనకు ముగ్గురు డీఎస్పీలు, 13 మంది సీఐలు, 12 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్స్ 99 మంది, పీసీలు 114 మంది, మహిళా పోలీసులు 36 మంది, హోంగార్డ్సు 65 మంది, మూడు స్పెషల్‌పార్టీ బృందాలు, మూడు ఏఆర్ టీంలతో భద్రత ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు.

మోడల్ డీఎస్సీ పరీక్షలు సద్వినియోగం చేసుకోండి

డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య/క్లాక్‌టవర్, మే 8(ఆంధ్రజ్యోతి): మోడల్ డీఎస్సీ పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ పరీక్షల పోస్టర్లను డీఈఓ ఆఫీస్‌లో ప్రసాద్‌బాబు, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, సొసైటీ అధ్యక్షుడు రమేష్ ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ.. ఈనెల 24న డీఎస్సీ అభ్యర్థుల కోసం ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా మోడల్ డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. మెగా డీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థులకు ఇవి ఉపయోగపడతాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 18వ తేదీలోగా స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని 13-186 డోర్ నంబర్‌లోని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. ఆన్‌లైన్‌లోగానీ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9059055965 నంబరులో సంప్రదించాలని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు సుంకర రమేష్ తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు డైరెక్టర్లు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ, జేఎల్ మురళి

గుర్తుతెలియని వృద్ధుడి అనుమానాస్పద మృతి

గార్లదిన్నె, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుంపల్లి సమీపాన ఓ గుట్టలో గుర్తుతెలియని వృద్ధుడు (60) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కనుంపల్లి సమీపంలోని గుట్ట నుంచి దుర్వాసన వస్తుండడంతో అటువైపు వెళ్లిన పశువుల కాపర్లు వెళ్లి చూశాడు. వృద్ధుడి మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. వృద్ధుడు నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని పోలీసులు అంచనా వేశారు. మృతుడు తెల్లటి షర్టు, తెల్లటి పంచె, తెల్లటి బనియన్, ఎర్రటి డ్రాయర్ ధరించి ఉనాడుడు. రైతు ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం పక్కన కూల్‌డ్రింక్ బాటిల్, పురుగు మందు డబ్బా ఉండడంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

బైక్ నుంచి పడి వృద్ధురాలి మృతి



పెద్దక్క (ఫైల్)

బత్తలపల్లి, మే8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లబోయనపల్లికి చెందిన పెద్దక్క (76) ప్రమాదవశాత్తు బైక్ నుంచి పడి గురువారం మృతిచెందింది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఓబులేసు భార్య పెద్దక్క బుధవారం గ్రామంలోకి స్టోర్ బియ్యం తెచ్చుకునేందుకు వరసకు మనవడు అయ్యే హరీష్ బైక్‌లో బయల్దేరింది. మార్గమధ్యలో పెద్దక్కకు కళ్లు తిరిగి కింద పడి గాయపడింది. వెంటనే పెద్దక్కను బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పెద్దక్క కుమారుడు పున్నప్ప ఫిర్యాదు మేరకు కేసు నమేదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

వడ్డీ వ్యాపారి ఆత్మహత్య



రామనాథరెడ్డి (ఫైల్)

తాడిపత్రి, మే8(ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీఐ కాలనీకి చెందిన వడ్డీ వ్యాపారి రామనాథ్ రెడ్డి (50) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రామనాథరెడ్డి వడ్డీలకు ఇచ్చిన రుణాలు సకాలంలో వసూలు కాకపోవడంతో మనస్తాపం చెందాడు. పట్టణంలోని గురు లాడ్జిలో గదిని అద్దెకు తీసుకుని, పురుగుల మందు తాగాడు. గమనించిన లాడ్జి సిబ్బంది.. పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రామనాథ్‌రెడ్డి మృతిచెందాడు. అతడికి భార్య వెంకటలక్ష్మమ్మ, కుమారుడు రవితేజారెడ్డి, కుమార్తె వందన ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఏఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

మళ్లీ సైన్యంలో చేరతా..

బీఎస్‌ఎఫ్ మాజీ జవాను ఆసక్తి



వడ్డే శీనప్ప

చెన్నేకొత్తపల్లి, మే8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో దేశరక్షణ కోసం తిరిగి సైనిక సేవలందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని బీఎస్‌ఎఫ్ మాజీ జవాను వడ్డే శీనప్ప పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తన గృహంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. బీఎస్‌ఎఫ్‌లో 24 ఏళ్లపాటు పనిచేశానన్నారు. అందులో 21 ఏళ్లు పాకిస్థాన్ సరిహద్దులో విధులు నిర్వహించానన్నారు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా గతేడాది బీఎస్‌ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ హోదాలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశానన్నారు. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా తిరిగి విధుల్లోకి చేరి సేవలందించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. దేశ రక్షణ రంగంలో పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన వారందరినీ తిరిగి విధుల్లోకి తీసుకుని, వారి సేవలను వినియోగించుకోవాలని ఆయన.. ప్రభుత్వాన్ని కోరారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరు బిహార్‌వాసుల మృతి

పెనుకొండ రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలం కల్లుకుంట సమీపంలో బాట సుంకలమ్మ ఆలయం వద్ద గురువారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని బిహార్‌కు చెందిన రాహుల్ (20), మహమ్మద్ సుభాన్ (30) మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మహమ్మద్ సుభాన్ పెద్దగోళ్లపల్లి ఎస్టేట్‌లో పనిచేస్తున్నాడు. తన కుమారుడితో కలిసి రొద్దం వెళ్లి, తిరిగి వస్తుండగా, రాహుల్, అఫ్సాన్ ఎదురుగా మరో బైక్‌పై వచ్చారు. రెండు బైకులూ వేగంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో రాహుల్, మహమ్మద్ సుభాన్ అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడిన అఫ్సాన్‌తోపాటు సుభాన్ కుమారుడిని 108 వాహనంలో పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం అనంతపురం తరలించారు. మృతదేహాలను పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. రొద్దం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి వెబ్‌లో మార్కుల జాబితాలు

అనంతపురం విద్య, మే 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతి మార్కుల మెమోలు శుక్రవారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ గురువారం తెలిపారు. అన్ని స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు తమ లాగిన్స్ ద్వారా ఎస్ఎస్‌సీ బోర్డ్ వెబ్‌సైట్ నుంచి మార్కుల జాబితాలు డౌన్‌లోడ్ చేసి, సంతకాలు చేసి విద్యార్థులకు అందించాలని సూచించారు. మార్కుల మెమోల్లో ఏవైనా తప్పులు దొర్లినట్లు హెచ్ఎంలు, తల్లిదండ్రులు గుర్తిస్తే.. వెంటనే స్కూల్‌లోని విద్యార్థి రికార్డులు, మార్కుల మెమో జిరాక్స్ కాపీలను జత పరిచి ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమాచారాన్ని ఆలస్యం చేయకుండా, ఈనెల 25వ తేదీలోగా డైరెక్టర్‌కు పంపాలని సూచించారు.

'జీవవైవిధ్యం' అవార్డులకు 13లోగా ఎంట్రీలు

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా 'ప్రకృతితో సామరస్యం.. స్థిరమైన అభివృద్ధి' అనే అంశంతో ఈనెల 22న అమరావతిలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు, బహుమతుల కోసం వివిధ విభాగాల్లో ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర జీవవైవిధ్య మండలి చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, సభ్య కార్యదర్శి పి. రామకృష్ణ గురువారం తెలిపారు. జీవవైవిధ్యంలో సాధించిన విజయాలు, సంబంధిత పేపర్ కటింగ్‌లు, ఫోటోలను 'రాష్ట్ర బయో డైవర్సిటీ బోర్డ్, ప్లాట్ నంబరు 209, వాల్నట్ బ్లాక్, రెయిన్ ట్రీపార్క్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా, గుంటూరు జిల్లా-522508' చిరునామాకు ఈ నెల 13లోపు పంపాలని సూచించారు.

రైతు కష్టం దళారీలపాలు

● దిగుబడి బాగా ఉన్నా.. గిట్టుబాటు ధర లేదు
● దళారులు చెప్పిన రేటుకే విక్రయం
● భారీగా నష్టపోతున్న అన్నదాతలు

ఓబుళదేవరచెరువు, మే 8(ఆంధ్రజ్యోతి): రైతుల కష్టం దళారీల పాలవుతోంది. ఈ ఏడాది రబీలో మండల వ్యాప్తంగా నాలుగువందల ఎకరాల్లో మొక్కజొన్న, 650 ఎకరాల్లో వేరుశనగ పంటలు సాగు చేశారు. కర్ణాటకతోపాటు ఇతర ప్రాంతాల నుంచి కొత్తరకం విత్తన కాయలు తెచ్చారు. సాగు కోసం రూ.వేలాది ఖర్చు పెట్టి, కంటికి రెప్పల పైరును కాపాడుకుంటూ వచ్చారు. వేసవిలో నీరు తక్కువ వచ్చినా పొరుగు రైతుల సాయంతో నీటి తడులు అందించారు. రైతులు పడిన కష్టానికి దిగుబడులు బాగా వచ్చాయి. అయితే మార్కెట్‌లో ధరలు లేవు. దీంతో దళారీలు అడిగిన రేటుకు దిగుబడులు అమ్మాల్సిన దుస్థితి రైతులకు ఏర్పడింది. వేరుశనగ బస్తా(42 కిలోల)కు మూడునుంచి నాలుగు కిలోలు, మొక్కజొన్న క్వింటాకు 3నుంచి నాలుగు కిలోలు దళారీలు తరుగుకింద రైతుల నుంచి అదనంగా తీసుకుంటున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న క్వింటా రూ. 2,300, వేరుశనగ నూనె శాతాన్ని బట్టీ రూ.2,300 నుంచి రూ.2,500 వరకు కొంటున్న దళారీలు బయట ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. ఇలా జరుగుతున్నా మార్కెటింగ్ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం కూటమి ప్రభుత్వమైనా రైతుల ఇబ్బందులను గుర్తించి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.


మొక్కజొన్నను ఆరబెట్టిన రైతులు


సాగు చేసిన టమోటా పంట

కూరగాయలకూ అంతే..

కూరగాయల పంటలకు కూడా మద్దతు ధర లేక రైతులు అవస్థలు పడుతున్నారు. రూ.లక్షలు వ్యయం చేసి, టమాటా పంటలతో పాటు వంగ, క్యారెట్, కాకార, బీన్స్, మునగ, బెండ, ముల్లంగి తదితర పంటలు సాగు చేస్తున్నారు. రైతుల వద్ద ప్రైవేటు మార్కెట్‌లో తక్కువ ధరలకు కొనుగోలు చేసే దళారీలు బహిరంగ మార్కెట్‌లో అదనంగా అమ్ముకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చినా, ఫలితం లేకపోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతుల కష్టానష్టాలు గుర్తించి ధరల స్థిరీకరణతోపాటు నియోజకవర్గ కేంద్రాల్లో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

దిగుబడి ఉన్నా ధరలు లేవు



గత నవంబరులో మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశా. ఆశించిన దానికంటే ఎక్కువగా దిగుబడి వచ్చింది. ధరలు లేకపోవడంతో దళారులు చెప్పిన రేటుకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. మూడు ఎకరాలకు గాను 70క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. దళారులు క్వింటాకు మూడు కేజీలు అదనంగా తరుగు కింద తీసుకుంటున్నారు.

- రెడ్డిపల్లి రాజారెడ్డి, నారప్పగారిపల్లి

దళారులు చెప్పిందే రేటు



వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి మొక్కజొన్న సాగు చేశా. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. దళారులను నమ్మి మోసపోవడంకంటే ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పిస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుంది. ఏపంటలు సాగుచేసిన రైతులు దళారుల చేతుల్లో మోసపోవాల్సిన దుస్థితి నెలకొంది.

-రామకృష్ణ, వెంకటాపురం.

రూ.లక్షలు నష్టం



రూ.లక్షలు ఖర్చు పెట్టి టమాట, వంకాయ పంటలు నాలుగు ఎకరాల్లో సాగుచేశా. ధరలు లేకపోవడంతో టమాట అడిగిన రేటుకే అమ్ముకోవాల్సి వస్తోంది. కనీసం పెట్టుకూడా రాకపోగా, ఉన్న అప్పులకు మరింత అప్పులు తోడయ్యాయి. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరలు కల్పించి, ఆదుకోవాలి.

- ఇడగొట్టు నాగరాజు, ఎంకొత్తపల్లి

న్యూస్ బాక్స్

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి


జేసీకి వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

పుట్టపర్తిటౌన్, మే8 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర రజక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు శివప్ప, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల ఆధ్వర్యంలో జేసీ అభిషేక్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ అన్నిరంగాల్లో వెనుకబడిన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్ మంజూరు చేయాలని, పట్టణ, గ్రామాల్లో దోబీఘాట్లు నిర్మించాలన్నారు. తెలంగాణాల మాదిరిగా రాష్ట్రంలో రజకులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో రజకులకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు గంగన్న, నాగరాజు, రామ్‌కుమార్, పెద్దయ్య నారాయణ, గంగాధర్, రాధమ్మ, కృష్ణమ్మ, నాగభూషణ, శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ


సతీష్‌నాయక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

గాండ్లపెంట, మే8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన గాజులవారిపల్లి పెద్దతండాకు చెందిన సతీష్‌నాయక్‌ను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం పరామర్శించారు. గత నెల 19న నల్లమాడ మండలంలోని అరవవాండ్లపల్లి వద్ద బొలెరో, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో సతీష్‌నాయక్ గాయపడ్డాడు. ఈవిషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివప్పనాయుడు, మాజీ ఎంపీటీసీ వెంకటరమణనాయక్, బూత్‌కన్వీనర్ క్రిష్ణానాయక్, నాగభూషణ, అంజినాయక్, నరసింహులు, చంద్ర పాల్గొన్నారు.

14న అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ధర్మవరం, మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేశవనగర్‌లో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాన్ని ఈ నెల 14న నిర్వహించనున్నట్లు గురుస్వాములు విజయ్‌కుమార్, బండ్లపల్లి వెంకట జయప్రకాశ్ తెలిపారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. అయ్యప్పస్వామి ఆలయాన్ని దాతల సాయంతో అతితక్కువ కాలంలో నిర్మించామన్నారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 10 నుంచి 14వ వరకు జరుగుతాయన్నారు. ఈ మహోత్సవాలకు మంత్రి సత్యకుమార్, ఎంపీ బీకే పార్థసారథి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరవుతారన్నారు.

మృతుడి కుటుంబానికి పల్లె పరామర్శ


మృతుడి కుమారుడిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి పల్లె

నల్లమాడ, మే8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవంకపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్ కుటుంబాన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. మృతుడు వేణుగోపాల్ తల్లిదండ్రులు, భార్య లక్ష్మీ, కుమారుడు నందకుమార్‌ను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి అందే సాయం అందిస్తామన్నారు. ఆయన వెంట ప్రసాద్‌రెడ్డి, అన్నం లక్ష్మీనారాయణ, రామాంజనేయులు తదితరులున్నారు.

కార్యకర్తలను ఆదుకుంటాం

ఓబుళదేవరచెరువు, మే8 (ఆంధ్రజ్యోతి): కష్టాలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉండి, ఆదుకుంటామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని డబురువారిపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన ఆదినారాయణ కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించారు. ఆదినారాయణ భార్య ఉత్తమ్మకు రూ. 5వేలు ఆర్థికసాయం అందించారు. బంజులవాండ్లపల్లిలో ఆర్టీసీ డ్రైవర్ జయచంద్రకుటుంబాన్ని పరామర్శించారు. తిరుపతిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జయచంద్ర మనవరాళ్లు మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు కన్వీనర్ జయచంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి: ఏఓ


భూసార పరీక్షలు నిర్వహిస్తున్న ఏఓ రమాదేవి

తాడిమర్రి, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని వ్యవసాయశాఖ అధికారి రమాదేవి పేర్కొన్నారు. గురువారం తాడిమర్రి మండలంలోని మర్రిమాకులపల్లి గ్రామంలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెలాఖరులోగా 973 మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలకు సంబంధించిన కార్డును ప్రజలకు అందజేస్తామన్నారు. ఫలితాలకు అనుగుణం గా రైతులు వారి పొలాలకు అవసరమయ్యే మందులు వాడి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సిబ్బంది రైతలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు: ఆర్డీఓ

ధర్మవరం, మే 8(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆర్డీఓ మహేశ్ ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి, ప్రజలలో అవగాహన పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆర్డీఓ కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ...ఇసుక అక్రమ రవాణాను నియంత్రించడానికి నియమించిన మండలస్థాయి సిబ్బందికి నివారణ చర్యల అమలులో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాలను సీజ్ చేసి, రవాణాదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలోమాట్లాడుతున్న ఆర్డీఓ మహేశ్

పోతులకుంటలో కేఏ పాల్ పర్యటన


రైతులతో మాట్లాడుతున్న కేఏపాల్

కొత్తచెరువు, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతులకుంట గ్రామంలో ప్రశాంతిపార్టీ అధ్యక్షుడు కేఏపాల్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది పేదవారికి అండగా నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఆర్డీటీ సంస్థకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనివ్వాలని కోరారు. ఈ విషయాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానన్నారు. గ్రామంలోని రైతులతో ముచ్చటించారు. అనంతరం శ్రీనివాసరెడ్డి ఇంటిలో భోజనం చేసి తిరిగి రోడ్డు మార్గాన విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

భృంగి వాహనంపై సంగమేశ్వరుడు


భృంగివాహనంపై ఊరేగుతున్న సంఘమేశ్వరుడు

కొత్తచెరువు, మే 8(ఆంధ్రజ్యోతి): సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామివారు భృంగివాహనంపై గ్రామ వీధులలో ఊరేగించారు. భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఎడ్లబండిపై హంసవాహనాన్ని ఏర్పాటు చేసి పుష్పాలతో అలంకరించారు. అందులో పార్వతీపరమేశ్వర ఉత్సవ విగ్రహాలను ఉంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. ఆలయ ధర్మకర్తలు మనోహర్, నటరాజ్, పణి, నాగరాజ్, అర్చకులు సాయి పాల్గొన్నారు.

12న పౌర్ణమి వేడుకలు

ధర్మవరం, మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డ్ సమీపంలో వెలసిన రమణ మహర్షి ఆశ్రమంలో ఈనెల 12న పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకులు చిప్పల వెంకప్ప గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు అరుణాచల దీపాన్ని వెలిగిస్తామన్నారు. అనంతరం భక్తులచే అక్షరమాణి మాల పారాయణం నిర్వహిస్తామన్నారు. భక్తులు ఈ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు

ధర్మవరం, మే 8(ఆంధ్రజ్యోతి): తాను మరణించినా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపాడు పట్టణంలోని రాంనగర్‌కు చెందిన కోదండ రామాలయ సభ్యుడు అన్నం వెంకటనారాయణ(80). విశ్వదీప సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ టెక్నీషియన్‌లు మృతుడి కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో వెంకటరమణ నేత్రాలను డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర, భాస్కర్, విజయభాస్కర్‌రెడ్డి, కంటి వైద్యు లు డాక్టర్ నరసింహులు నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో విశ్వదీపా సేవా సంఘం ఫౌండర్ కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, ప్రెసిడెంట్ గాజుల సురేశ్, ఉపాధ్యక్షుడు టీసీ రత్నశేఖర్‌రెడ్డి, సభ్యులు సుబ్రహ్మణ్యం, రఘు, కేశవరెడ్డి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

అమడగూరు/కదిరి, మే8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రఘునాథ్‌రెడ్డి, సీఎస్‌డీటీ రమాదేవి గురువారం ఓప్రకటనలో తెలిపారు. కొత్తకార్డులు, సభ్యుల జోడింపు, చిరునామా మార్పు, తప్పు ఆధార్ సీడింగ్ కార్డు సరెండర్ తదితర మార్పులు చేసుకోవచ్చునన్నారు. ఈసేవల కోసం అర్హులైన లబ్ధిదారులు వారి పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనితోపాటు క్యూఆర్ కోడ్‌తో స్మార్టు రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు చెప్పారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

నంబులపూలకుంట, మే8(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓగా పార్థసారథి గురువారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జీ ఎంపీడీఓ అంజనప్ప కదిరి డీఎల్‌పీఓగా బాధ్యతలు చేపట్టారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి


మంజునాథ్ (ఫైల్)

బత్తలపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన బత్తలపల్లికి చెందిన మందల మంజునాథ్ (32) గురువారం తెల్లవారు జామున మృతి చెందినట్లు ఎస్ఐ గోవిందు తెలిపారు. ఆయన తెలిపిన మేరకు మంజునాథ్ వాహన డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. భార్య సరస్వతి అనారోగ్యం బారిన పడటంతో రెండేళ్లుగా అప్పులు చేసి వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయిస్తున్నాడు. ఈనేపథ్యంలో మూడు రోజుల కిందట మంజునాథ్ తండ్రికి కింద పడటంతో కాలు విరిగింది. అతడిని అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. ఈక్రమంలో మరిన్ని అప్పులు అవుతాయన్న భయంతో భార్య సరస్వతిని ఆస్పత్రిలో తండ్రి వద్ద ఉంచి మంజునాథ్ బుధవారం బత్తలపల్లికి వచ్చాడు. ఇంట్లో పురుగుల మందు తాగాడు. అనంతరం స్నేహితులకు ఫోన్ చేసి విషయం తెలిపాడు. దీంతో వారు వచ్చి మంజునాథ్‌ను ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి ఎనిమిదేళ్ల కుమారుడు యోగేశ్వర్, ఆరేళ్ల కుమార్తె త్రివేణి ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భూసేకరణను వేగవంతం చేయండి: కలెక్టర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తిటౌన్, మే8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం కోసం వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భూ సేకరణ సంబంధించిన పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జాతీయ రహదారులు, భూసేకరణ పనుల పురోగతిపై ఆర్డీవోలు, నేషనల్ హైవే అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అనే ప్రాంతాల్లో భూసేకరణ పెండింగ్ పనులున్నాయని, వాటిని నిర్ణీత కాలంలో పూర్తి చేయాలన్నారు. బుక్కపట్నం మండలంలోని బుచ్చయ్యగారిపల్లి వద్ద భూసేకరణ సమస్య పెండింగ్‌లో ఉందని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సహకారంతో పూర్తి చేయాలన్నారు. అలాగే పుట్టపర్తి మండలంలోని పెడబల్లి, కప్పలబండ ప్రాంతలో ఇదే సమస్య ఉందని, దాన్నికూడా పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణలో సమస్యలుంటే జాతీయ రహదారుల అథారిటీ అధికారులు సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దార్లును సమన్వయం చేసుకుని పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, ఆర్డీవో సువర్ణ, ఆనంద్, వీవీఎస్ శర్మ, జాతీయ రహదారుల అధికారులు గిడ్డయ్య, సుజాత, మల్లికార్జునరావు, అశోక్‌కుమార్, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

పుట్టపర్తిరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సత్యసాయి ఎయిర్‌పోర్టుకు వస్తున్న దృష్ట్యా జిల్లా కేంద్రం లో ట్రాఫిక్ మళ్లింపు చేపట్టినట్లు జిల్లా పోలీసుయంత్రాంగం తెలి యచేసింది. కదిరి ముదిగుబ్బ నుంచి వచ్చేవాహనాలు కర్ణాటక నాగేపల్లి, గణేష్‌సర్కిల్, బ్రాహ్మణపల్లి, సూపర్ హాస్పిటల్ మీదుగా మామిళ్లకుంట వైపు వెళ్ళాలన్నారు. కమ్మవారిపల్లివైపునుండి వచ్చే వాహనాలు బైపాస్‌మీదుగా వెళ్ళాలన్నారు. కొత్తచెరువు, గోరంట్ల వైపునుండి వచ్చేవాహనాలు మామిళ్లకుంట సూపర్‌హాస్పిటల్ బీడుపల్లి క్రాస్, బ్రాహ్మణపల్లి, ఎనుమలపల్లి చిత్రావతి బైపాస్‌మీదుగా వాహనాల ట్రాఫిక్ మళ్ళించడం జరిగిందని పోలీసు అధికారులు తెలియచేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కదిరి అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళసముద్రం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన ఆది(35) మృతి చెందాడు. అతడి తల్లి తీవ్రంగా గాయపడ్డారు. బంధువులు, స్థానికులు తెలిపిన మేరకు ఆది, అతడి తల్లి నాగలక్ష్మి కదిరి నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా కాళసముద్రం గురుకుల పాఠశాల వద్ద కదిరి వైపు నుంచి అనంతపురం వైపు వెళుతున్న కారు వెనుక నుంచి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆది మృతి చెందగా, నాగలక్ష్మిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. విషయం తెలుసుకున్న భార్య, పిల్లలు గుండెలవిసేలా రోదించారు.

శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలి

కదిరిఅర్బన్, మే8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గిరిజన గ్రామాలకు శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని మండలపరిషత్ ఉపాధ్యక్షులు ఆనంద్‌నాయక్ గురువారం ఆర్డీవో వీవీఎస్ శర్మకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో శ్మశాన వాటికలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. శవాలను దూర ప్రాంతాల్లో పూడ్చుకోవాల్సి వస్తోంది. వంకలు, వాగుల్లో పూడ్చుకుంటున్నామని బాధపడ్డారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా, ప్రయోజనం లేదన్నారు. స్పందించి గిరిజన గ్రామాల్లో శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఇద్దరిపై కేసు నమోదు

కదిరి, మే8(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో తనమీద అసభ్య పోస్టులు పెడుతున్నాడని గుడిసె దేవానంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిజాంవలీకాలనీలో ఉండే శెట్టిబాబు, కదిరి బైపాస్‌రోడ్డులో ఉండే షేక్ సవాప్‌పై కేసు నమోదు చేసినట్లు కదిరి సీఐ నారాయణరెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కదిరి వాటర్ ట్యాంక్‌రోడ్డులో నివాసముంటున్న గుడిసే దేవానంద్‌పై వీరిరువురి రాజకీయ కక్షకట్టి అసభ్యంగా పోస్టులు పెట్టడం, కించపరచడం వంటివి చేస్తున్నారని బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రీజినల్ మేనేజర్‌కు సన్మానం

కదిరి, మే8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి విశ్వకర్మయోజన కింద లబ్ధిదారులకు విరివిగా రుణాలు మంజూరు చేసిన ఏపీజీబీ రీజినల్ మేనేజర్ రమేష్‌ను గురువారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేదల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని అర్హులకు అందజేయడంలో మేనేజర్ కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా ఆర్గానిక్ రాష్ట్ర కన్వీనర్ చింతా శరత్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఇందుకూరి సురేంద్రరెడ్డి, సుబ్బరాజు, రామాంజనేయులు, పరమేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


రీజనల్ మేనేజర్‌కు సన్మానం చేస్తున్న బీజేపీ నాయకులు

బైకు బోల్తా.. మహిళకు గాయాలు

నల్లచెరువు,/కదిరి, మే8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతరైల్వేస్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి, బోల్తా పడటంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన మేరకు అన్నమయ్యజిల్లాలోని మదనపల్లికి చెందిన శ్రీనివాసులు, భార్య సరస్వతి గురువారం ద్విచక్ర వాహనంపై కదిరినుంచి మదనపల్లికి వెళ్తుండగా పాత రైల్వేస్టేషన్ సమీపంలో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో సరస్వతి తీవ్రంగా గాయపడింది. ఆమెను 108వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికెళ్లి ప్రమాదంపై ఆరాతీశారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

కదిరిఅర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నంకోసం తన భర్త, అత్త వేధిస్తున్నారని ఓ మహిళ ఫిర్యాదు చేసినట్లు రూరల్ సీఐ నీరంజన్‌రెడ్డి గరువారం తెలిపారు. మండలంలోని కందికుంట కాలనీకి చెందిన తులసీని నల్లచెరువు మండలంలోని దామావాండ్లపల్లికి చెందిన సాయికుమార్‌కు ఇచ్చి మూడేళ్ల కిందట వివాహం చేశారు. వీరికి ఒక బాబు ఉన్నాడు. ఐదు నెలల నుంచి భర్త, అత్త లక్ష్మీ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, ఆమె పుట్టినింటికి వచ్చేసింది. ఈక్రమంలోనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు భర్త, అత్తపైన కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి హనుమ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం

అమరాపురం, మే 8(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని నడలుడం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం నుంచి ఆదివారం వరకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం గంగపూజ, ఆలయ ప్రవేశం, గణపతిపూజ, నవగ్రహపూజ, అగ్నిప్రతిష్ఠ హోమం, చండిహోమం జరిగాయని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం బ్రహ్మ ముహూర్తంతో ఆంజనేయస్వామి మూల విగ్రహ ప్రతిష్ఠాపన, కలశ ప్రతిష్ఠాపన, గణహోమం, రాత్రికి భజన ఉంటుందన్నారు. శనివారం ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని రాత్రికి కోలాటం ఉంటుందన్నారు. ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

నేటి నుంచి సప్తమాతృకాదేవి బ్రహ్మోత్సవాలు

● 11న ఉట్ల పరుష

చిలమత్తూరు, మే 8(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే సప్త మాతృక దేవి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు టీడీపీ సీనియర్ నాయకులు కొడికొండ బాలాజీ గురువారం తెలిపారు. ఉదయం కొండపై వెలసిన అక్కమ్మదేవికి అభిషేకాలు, కుంకుమ అర్చనలతో పూజలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 8 గంటలకు గణపతి పూజ, మధ్యాహ్నం 12 గంటలకు బలిహరణం, దీపోత్సవం ఉంటుందని, శనివారం అమ్మవారికి రథోత్సవం నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా తోపులో వెలసిన ఆంజినేయస్వామి ఆలయంలో పంచామృత అభిషేకాలు, 11వ తేదీన తోపులో వెలసిన అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఉట్లపరుష, 12న వసంతోత్సవం, ధ్వజారోహణ కార్యక్రమాలు, ముత్యాలపల్లకి ఉంటాయన్నారు. 13న గ్రామంలో వెలసిన అక్కమ్మగారు, ఆంజినేయస్వామి, పంచనందీశ్వరుడు, వేణుగోపాలస్వామి, నరసింహస్వామి, సీతారామస్వామి, బసవేశ్వరస్వామి, గణపతి స్వామి గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దైవచింతన అలవర్చుకోవాలి

● ఎలేరాంపుర హనుమంతనాథ స్వామీజీ



భూమిపూజలో పాల్గొన్న ముఖ్య అతిథులు

అగళి, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని కర్ణాటక రాష్ట్రం ఏలేరాంపుర హనుమంతనాథ స్వామీజీ సూచించారు. గురువారం అగళి మండలం రామాపురం గ్రామంలో నూతన రామదేవాలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమంతనాథ స్వామీజీ, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవుడు దైవానుగ్రహంతో జీవిస్తున్నాడన్నారు. ప్రతి ఒక్కరూ దైవచింతనను అలవర్చుకుని ధర్మమార్గంలో పయనించాలన్నారు. పురోహితుడు సుబ్బన్న శాస్త్రి పూజా కార్యక్రమాలను చేపట్టారు. భూమిపూజకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, జడ్పీటీసీ ఉమేష్, మహేంద్ర, రవికుమార్, స్థానికులు జయరామప్ప, నందీష్, లక్ష్మీ, నరసప్ప, శివానంద, సిమెంటు మూర్తి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

సోమందేపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయరహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పోలీసులు సీజ్‌చేసి డ్రైవర్‌పై గురువారం కేసు నమోదుచేశారు. వివరాల్లోకెళితే ధర్మవరం నుంచి బెంగళూరుకు రేషన్ బియ్యంను తరలిస్తుండగా వచ్చిన సమాచారం మేరకు పోలీసులు వైఎస్ఆర్ సర్కిల్‌లో వాహనతనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని అడ్డగించి డ్రైవర్ హరిను అరెస్ట్‌చేసి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వం చౌకడిపోలద్వారా పేదలకు సరఫరాచేసే పీడీఎఫ్ రైస్ పేదల వద్ద నుంచి సేకరించి అక్రమంగా బెంగళూరుకు తరలిస్తున్నట్లు తెలిపారు. నాలుగు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పౌరసరఫరాలశాఖ డీడీ మోహన్‌నాయక్, వీఆర్‌ఓల సమక్షంలో పంచనామా నిర్వహించి వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పెనుకొండ రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించి మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని పెనుకొండలోని రామమందిరం వీధికి చెందిన పద్మనాభరావు కుమారుడు కృష్ణారావుపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రొద్దం మండలం లోచర్ల గ్రామానికి చెందిన ముత్యాలప్ప వద్ద పెనుకొండలోని పద్మనాభరావు కుమారుడు కృష్ణారావు డబ్బులు తీసుకుని భూమి అగ్రిమెంట్ చేసుకుని భూమి ఇతరులకు అమ్మేశాడని ముత్యాలప్ప కృష్ణారావు ఇంటివద్దకు వెళ్లి ప్రశ్నించాడు. అతను కులం పేరుతో దూషించి మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని ముత్యాలప్ప ఫిర్యాదు మేరకు కృష్ణారావు, భార్య లీలమ్మపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పూర్తికాని గోదాముల నిర్మాణం

- వైసీపీ హయాంలో ఆర్భాటంగా ప్రారంభం
- మొదటి విడతలో ప్రారంభమైన 13 గోదాములు
- రెండో విడత నిధులు మంజూరు చేయని జగన్
- ప్రజాధనం వృథా అంటూ రైతుల మండిపాటు



కదిరేపల్లిలో నిరుపయోగంగా ఉన్న గోదాము



గౌడనహళ్లిలో నిధులు విడుదలకాక నిలిచిన గోదాము నిర్మాణం

మడకశిర రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలు కొనుగోలు చేసి ఆ పంటలను నిల్వ ఉంచేందుకు వైసీపీ ప్రభుత్వం పంచాయితీ కేంద్రాల్లో గోదాముల నిర్మాణాలు చేపట్టింది. రైతులకు మేలు చేస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటనలు చేసింది. అయితే నిధుల కొరతతో గోదాముల నిర్మాణాలు వివిధ దశల్లోనే ఆగిపోయాయి. దీంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో 2022లో మొదటి విడుతగా నియోజకవర్గానికి 13 గోదాములను మంజూరు చేసింది. గౌడనహళ్లి, సీ.కోడిగేపల్లి, బుళ్ళసముద్రం, ఆమిదాలగొంది, మడకశిర, కదిరేపల్లి, మెళవాయి, గుడిబండ, మందలపల్లి, మోరుబాగులు, ఆలుకూర్, రొళ్ల, అమరాపురానికి గోదాములు మంజూరుచేసింది. ఒక్కొక్క గోదాము నిర్మాణానికి రూ. 22 లక్షలుకేటాయించింది. 13 గోదాములకు మొత్తం రూ.2.86 కోట్లు మంజూరుచేసింది. ఈ గోదాములు స్థానిక మార్కెట్ యార్డు సహకారంతో, ఏడీసీ బ్యాంక్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టారు. మొదటి దశలో నిధులు విడుదల కావడంతో గోదాములు నిర్మాణాలు చేపట్టారు. రెండో విడుత పనులు చేపట్టడానికి నిధులు విడుదల కాకపోవడంతో పనులు ఆగిపోయాయి. కొంత మంది నిధులు వస్తాయి అని అత్యుత్సాహంతో సొంత నిధులతో గోదాములు టాప్ లైవల్ వరకు పనులు పూర్తిచేశారు. ఇలా రెండు గోదాముల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన గోదాములు అన్నీ వివిధ దశలోనే ఆగిపోయాయి. దీని వల్ల రైతులకు మంచి జరగలేదు కదా ప్రజాధనం వృథా అయ్యిందని రైతులు అంటున్నారు.

రైతులకు మేలు జరగలేదు



వైసీపీ ప్రభుత్వంలో రైతులకు మేలు జరగలేదు. కేవలం మాటలకే నాయకులు పరిమితమయ్యారు. చాల చోట్ల గోదాముల నిర్మాణాలు పూర్తికాలేదు. జగన్ రైతులకు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. రైతులను మాటలతో మభ్యపెడుతూ వచ్చారు.

- రామాంజనేయులు, ఆదర్శ రైతు, ఆర్ అనంతపురం

పొంచి ఉన్న ప్రమాదం

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటుచేయని వైనం



పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో..

సోమందేపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాద గంటికలు మోగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలకు ముప్పుగా కనిపిస్తున్నాయి. ఏళ్లతరబడి రోడ్ల వెంబడి ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడే ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనకుగురవుతున్నారు. మండల కేంద్రంలో ఇలాంటి ట్రాన్స్‌ఫార్మర్లు పదికిపైగానే ఉన్నాయి. ప్రధానంగా మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే ఓ ట్రాన్స్‌ఫార్మర్, ఎన్టీఆర్ సర్కిల్ మలుపులో మరో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంటున్నాయి. పంచాయతీ కార్యాలయానికి ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. అదేవిధంగా ఎన్టీఆర్ సర్కిల్‌వద్ద ప్రజల రాకపోకలతో ఆ ప్రాంతం రద్దీగా ఉంటోంది. ఈ రెండు ప్రాంతాలేకాక కొత్తపల్లి, శివానగర్, పాతూరులోని పలు ప్రాంతాల్లో ఇలాంటివి చాలా ఉన్నాయి. ఇటీవలే ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఏఈ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. లైన్‌మెన్ రామచంద్రారెడ్డి విద్యుత్ ప్రమాదానికి గురై మృతిచెందిన సంఘటనలో ఆయనపై బదిలీవేటు పడింది. అప్పటి నుంచి ఏఈ స్థానం ఖాళీగానే ఉంది. దీంతో విద్యుత్‌శాఖ పరిపాలన గాడి తప్పింది. ఈ సమస్యపై ప్రజలు ఎవరితో మొరపెట్టుకోవాలో తెలియని పరిస్థితి దాపురించింది. దీనిపై ఏడీఏ శేషగిరిబాబు వివరణ కోరడానికి ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు. సత్వరం అధికారులు చర్యలు చేపట్టి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలకు నిలయాలు.. మలుపులు

- ఎన్‌హెచ్ 544 హైవేలో తరచూ ప్రమాదాలు
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- పట్టించుకోని యంత్రాంగం



అగళి మండలం హులికెర వద్ద ఉన్న మలుపు



హెచ్‌డీ హళ్లి వద్ద ప్రమాదకర మలుపు

అగళి, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలకు నిలయంగా మలుపులు ఉంటున్నాయి. ఎక్కువగా మలుపు ఉంటుండటంతో వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. వడగుంటనహళ్లి హైవే, హెచ్‌డిహళ్లి హైవే క్రాస్ వద్ద అనేక ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. అగళి మండలం కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉంది. ప్రజలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎన్‌హెచ్ 544 హైవే రోడ్డును కొడికొండ చెక్‌పోస్టు నుంచి శిర వరకు వేయాల్సి ఉంది. అగళి మండలం పి బ్యాడిగెర వరకు పనులు పూర్తయ్యాయి. ఈ ప్రాంతంలో రాకపోకలు జరుగుతున్నాయి. కర్ణాటక ప్రాంతానికి సంబంధించి ఇప్పటి వరకు హైవే పనులు చేపట్టలేదు. అయితే రొళ్ల మండలం పి బ్యాడిగెర పంచాయతీ వరకు హైవేలో అనేక ప్రమాదాల జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోయారు. వడగుంటనహళ్లి హైవేలో హెచ్‌డిహళ్లి హైవే క్రాస్ అగళి హైవే మెయిన్‌రోడ్డు రామనపల్లి క్రాస్‌లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఏమాత్రం చర్యలు తీసుకోవడంలేదు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. మలుపు ఎక్కువగా ఉంటుండటం వల్ల ఆ వైపు వచ్చే వాహనాలు వాహనదారులకు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదాలకు నిలయం



అగళి మండలం హెచ్‌డీ హళ్లి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా ఉంటోంది. ఇక్కడ ప్రమాదాలు ఎక్కువ సంఖ్యలో జరుగుతున్నాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. క్రాస్ వద్ద ప్రమాదాలు ఎక్కువ చోటు చేసుకుంటున్నాయి. అధికారులు వెంటనే చొరవచూపి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

-రామకృష్ణ, అగళి

నేడు, రేపు ఆలయ వార్షికోత్సవాలు

హిందూపురం, మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యానగర్‌లో వెలసిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్ర, శనివారాల్లో వార్షికోత్సవ వేడుకలు జరుగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం మూలదేవత ప్రార్థన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, కలశస్థాపన, వాస్తుహోమం ఉంటుందన్నారు. అదేవిధంగా శనివారం కలశార్చన, అగ్నిప్రతిష్ఠ, నవగ్రహాలపూజలు ఉంటాయని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యుల కోరారు.

నిరుపయోగంగా నీటి తొట్టెలు



ఎండిపోయిన నీటితొట్టె

గుడిబండ, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూజారిపల్లి అటవీప్రాంతంలో వన్య ప్రాణుల దాహార్తి తీర్చడానికి అటవీశాఖ అధికారులు నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా ఉన్నాయి. వేసవి సందర్భంగా అటవీప్రాంతంలో నీటి సౌకర్యం లేకపోవడంతో రైతుల బోరు బావులు, ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉన్న నీటి కోసం ఎలుగుబంట్లు, చిరుత, నక్కలు గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి అటవీప్రాంతంలో నిర్మించిన నీటి తొట్టెలకు నీరు సరఫరాచేసి వన్యప్రాణుల దాహార్తి తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

బోరులో పుష్కలంగా నీరు

రొళ్ల, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిజిహట్టి గ్రామంలో నూతనంగా వేసిన బోరులో నీరు పుష్కలంగా రావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల అతిసార వ్యాధితో బాధపడుతున్నవారిని పరామర్శించడానికి వచ్చిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలను జిజిహట్టి గ్రామస్థులు నీటి సమస్యను వివరించగా 24 గంటలు గడవక ముందే బోరు వేయించారు. నీరు పుష్కలంగా లభించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాక్టర్‌కు మరమ్మతులు చేపట్టండి

గుడిబండ, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలపల్లి పంచాయతీ గ్రామానికి స్వచ్ఛభారత్ కింద చెత్త సేకరణకోసం ట్రాక్టర్ మంజూరు చేశారు. అయితే ట్రాక్టర్ మరమ్మతులకు రావడంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పుపట్టిపోతోంది. అధికారులు చొరవ తీసుకుని ట్రాక్టర్‌కు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



తుప్పుపట్టిపోతున్న పంచాయతీ ట్రాక్టర్

తాగునీటి సమస్య తలెత్తకూడదు

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ



అధికారులకు సూచనలు ఇస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

మడకశిర టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ సూచించారు. తండా ప్రాంతాల్లో సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గం 2047 విజన్‌పై సమావేశం నిర్వహించారు. అన్ని మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు, ఏపీఓలు, హౌసింగ్ ఏఈలు తదితరులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్‌కు అనుగుణంగా పనిచేయాలని, గ్రామాల్లో సమస్యల పరిష్కరంపై దృష్టి పెట్టాలని పలుసూచనలు చేశారు. మండలస్థాయి విజన్‌లు సిద్ధం చేయడంపై సూచనలు చేశారు. అదేవిధంగా ఇల్లు మంజూరు అయిన వారికి త్వరితగతిన ఇంటి పట్టాలు ఇవ్వాలని ఆదేశించారు. ఉపాధిహామీలో కూలీల సంఖ్య పెంచాలని, పశువుల తొట్టెల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు సోనిబాయి, రామారావ్ తదితరులు పాల్గొన్నారు,

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ రెడ్డప్ప

పరిగి, మే 8(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ ఎంపీడీఓగా రెడ్డప్ప గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో తనకల్లులో ఏఓ పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు కృషిచేస్తానని ఎంపీడీఓ రెడ్డప్ప పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓకు పలువురు టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): నూతన ఎంపీడీఓగా వెంకటలక్ష్మమ్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. శింగనమల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై సోమందేపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు వడ్డే సూరీ, కిష్టప్ప, సూర్యనారాయణ, కార్యదర్శి రామాంజినేయులు, ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి, సర్పంచ్ గంగమ్మ, ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషిచేస్తానని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

న్యాయం చేయండి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుకొండ, మే 8(ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వులు ఉన్నా పంచాయతీ అధికారులు పేదలు నిర్మించుకున్న గుడిసెలను, షెడ్లను కూల్చివేశారని తమకు న్యాయం చేయాలని సోమందేపల్లి మండలం నల్లగొండ్రాయనపల్లికి చెందిన పేదలు ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీఓకు వినతిని అందిస్తూ నల్గొండ్రాయనపల్లిలో సర్వేనంబరు 700లో గత మూడేళ్లుగా గుడిసెలు వేసుకుని, రేకులషెడ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. గుడిసెలు తొలగించకుండా కోర్టు స్టే ఇచ్చిందన్నారు. అయినా పంచాయతీ అధికారులు లెక్కచేయకుండా పేదలు కట్టుకున్న ఇళ్లను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పు చేసి ఇళ్లను నిర్మించుకుని జీవిస్తున్నారని, ఉన్నఫళంగా కూల్చివేయడంతో వారు నడిరోడ్డుపై పడ్డారన్నారు. ఈ ఘటనపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, సీఐటీయూ జిల్లా నాయకుడు రమేష్, సీపీఐ నాయకులు రాజగోపాల్, చాంద్‌బాషా, నారాయణస్వామి, అంజినమ్మ, నూర్‌జహాన్ తదితరులు పాల్గొన్నారు.

13న ఉచిత హోమియో వైద్యశిబిరం

పెనుకొండ, మే 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆల్విన్ కాలనీలోని బాబా భజనమందిరంలో ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవాసమితి కన్వీనర్ శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో పుట్టపర్తికి చెందిన హోమియో వైద్యులు పద్మావతమ్మ, గిరీష్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే శిబిరంలో మోకాళ్ల నొప్పులు, కీళ్లనొప్పులు, థైరాయిడ్, శ్వాసకోశకు సంబంధించిన వ్యాధులకు పరీక్ష చేయడం జరుగుతుందన్నారు. వెన్నెముక, మానసిక, ఆస్తమా, నరాలబలహీనత, గైనకాలజీ, పైల్స్, చిన్న పిల్లల సమస్యలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలి

పెనుకొండ, మే 8(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన అనంతపురం జిల్లాలో 60ఏళ్లుగా పేదల సంక్షేమం కోసం కృషిచేస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను వెంటనే పునరుద్ధరించాలని సాహితీగగన్మహల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి గురువారం ప్రకటనలో కోరారు. శుక్రవారం ఛాయాపురం గ్రామంలో హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు ప్రారంభించడానికి సీఎం వస్తున్నారని, ఆయన దృష్టికి జిల్లా నాయకులు సమస్యను తీసుకెళ్లాలని సూచించారు.

హైజీన్ కిట్ల వితరణ

చిలమత్తూరు, మే 8(ఆంధ్రజ్యోతి): వికలాంగ విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత కోసం రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు గురువారం హైజీన్ కిట్స్‌ని అందజేశారు. మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో ఉన్న సమర్థన ట్రస్టులో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కుమార్‌స్వామి రెడ్డి, కొడికొండ చెక్‌పోస్టు శివకుమార్, మొబలైజర్ రామాంజి విద్యార్థులకు కిట్స్‌ని అందజేశారు. వ్యక్తి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సమర్థన ట్రస్టు సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు.

స్కాం కోసమే కుట్టుమిషన్లు

హిందూపురం, మే 8(ఆంధ్రజ్యోతి): స్కాం చేయాలనే ఉద్దేశంతోనే ఈ ప్రభుత్వం ఉచిత కుట్టుమిషన్లకు శ్రీకారం చుట్టిందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దీపిక, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతి అన్నారు. గురువారం హిందూపురంలోని వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుట్టుమిషన్ల పంపిణీ పేరుతో భారీగా దోపిడీకి శ్రీకారం చుట్టారన్నారు. బీసీల పేరుతో భారీగా దోచేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ కాకుండా గుజరాత్‌లో కుట్టుమిషన్లు కొనడం వెనుక ఆంతర్యం ఏమిటన్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, నాగమణి, మునిసిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.